ఓంశ్రీసాయిరాం

# యుధిష్ఠిరుడు

*హస్తినాపురమును పాలించిన చక్రవర్తి ఈ ధర్మమూర్తి. నిష్కపటమే యుధిష్ఠిరుని నిష్ఠ. రాజనీతి ప్రవీణుడు. ఉదార హృదయుడు. క్షమ, శీల, సరళ స్వభావుడు. తన జీవితమునకు సత్యధర్మములే సరియైన ఆయుధములని నిత్యనిష్ఠలయందు నిరూపించిన నిర్మలచిత్తుడు. తన సోదరులైన భీమ, అర్జునులు కాని, ధర్మపత్నియైన ద్రౌపది కానీ కొన్ని సమయములందు క్రోధమును అరికట్టలేక మండిపడుచున్నప్పుడు, ధర్మరాజు వారలకు ఎన్నియో విధముల శాంతిని బోధించి సహనమును నేర్పెడివాడు. మాటను జవదాటని మహనీయుడు. కష్టములయందును, సుఖములయందును, మానావమానములందును, కీర్తిప్రతిష్ఠలయందును దైవమును నిందించుటగాని, విస్మరించుటగానీ యుండెడిదికాదు. సర్వ కర్మలకు సర్వేశ్వరుడే కారణమని విశ్వసించి, సర్వకర్మలూ భగవత్ ప్రీత్యార్థములని భావించి, కృష్ణుని సేవించుచుండెడివాడు. పంచపాండవులే కృష్ణుని దేహముగను, కృష్ణుడే పాండవుల గుండెలుగనూ ప్రేమించి కృష్ణుని ఆజ్ఞను జవదాటక, ఎవ్వరినీ ద్వేషించక, కష్టసుఖములు మానవునికి ఖర్మఫలములని తలంచి హృదయపూర్వకమైన స్వాగతములిచ్చెడివాడు. దయాధర్మ దైవాపేక్షలే ఇతని దీక్ష. ఈ ధర్మజుడు అజాతశత్రువను సార్ధకమును సాధించెను. నమ్మినవారిని వమ్ముచేయని గుణము ఇతనిలో ప్రత్యేక కిరణము. తనవెంట వచ్చిన శునకమును స్వర్గములో ప్రవేశింపకుండిన తనకుకూడను ఈ స్వర్గమక్కరలేదని త్యాగమును పూనిన మహాయోగి యుధిష్ఠిరుడు.*

ప్రేమ అనగా యేమిటి? ఎట్టి ఫలమును ఆశించక ఉపకారముచేసే తత్వమునకే ప్రేమ అని పేరు. భగవద్గీతయందు సుహృత్ అన్నాడు. భగవంతుడే నిజమైన స్నేహితుడు. నీ నుండి యెట్టి ఫలితమును ఆశించక అన్నిసమయములందు నీకు తోడుగా ఉండి నీయొక్క వాంఛలను నెరవేరుస్తూ వస్తున్నాడు. నీనుండి అతను యేఫలమును ఆశించటంలేదు. తల్లి, కుమారుడు పెద్దవాడై తన వృద్ధాప్యములో సాకుతాడనే అపేక్షచేత కుమారుని ప్రేమిస్తుంది. తండ్రికూడా అదేవిధముగా ప్రతిఫలాపేక్షచే కుమారుని ప్రేమిస్తుంటాడు. కానీ భగవంతునియందు స్వార్థరహితమైన ప్రేమ ఉండటంచేత యీ ఒక్కటి మాత్రమే సుహృత్ అనే పదమునకు అర్హత. ప్రేమకు నానార్థములు పెంచి, అనర్థములు స్వీకరించి, యదార్థమును విస్మరించి దుఃఖమునకు గురౌతున్నారు మానవులు. ఈ ప్రేమకు నానార్థములు లేనేలేవు. ఒకే అర్థము. ఇది హృదయానికి హృదయము.

ఒకానొక సమయంలో ధర్మజుడు రాజ్యము వదలి ద్రౌపదీ సమేతుడై హిమాలయములలో కాలము గడుపుతున్నాడు.

*జేనెడు పొట్టనింపుకొన చిక్కుల నొందుచు కోటివిద్యలన్*
*పూనికమీర నేర్చి పరిపూర్ణ సుఖంబును పొందలేక యీ*
*మానవజాతి దుఃఖముల మ్రగ్గగనేటికి శ్రీపరాత్పరున్*
*ధ్యానము చేయు భక్తులకు దారిని చూపకయున్నె మానవా!*

ద్రౌపది కంటిధారలు కార్చుకుంటూ 'నాథా! వేలమందికి అనుకూలములు గావించి, అన్నమును ప్రసాదించి, దుర్భిక్షము దూరముచేసి ధర్మమును కాపాడుతూ దానము చేసిన నీకు యీ కష్టములకు కారణమేమిటి? సాక్షాత్ ధర్మస్వరూపమే నీవు. నీకా యీ కష్టములు రావటం. పట్టెడన్నముతో పొట్ట నింపుకొనలేకపోతున్నావుకదా యిప్పుడు. ఈ కఠినమైన జీవితాన్ని కారడవులందు గడపటానికి కారణం ఏమిటి? భగవంతుని అనుగ్రహము లేకపోవటమా లేక నీ భక్తిలోని దోషమా? ఈ కష్టములకు కారణం ఏమిటి?' అని ప్రశ్నించింది. ధర్మరాజు చిరునవ్వు నవ్వుతూ 'ద్రౌపదీ! చూడు. ఈ హిమాలయ పర్వతములు యెంత అందముగా ఉంటున్నాయి. ఈ అందమైన పర్వతములు నాకేమి ఫలితమునందిస్తున్నాయి? నాకేమి సహాయము చేస్తున్నాయి? ఏమీ చేయటంలేదు. కానీ నాకు వాటిని చూచిన తక్షణమే ఆనందము ఆవిర్భవిస్తున్నాది. అందమె ఆనందం. ఆనందమె జీవిత

మకరందం. అందమే ఆనందము నందిస్తుంది. దానికి మించిన ఆనందము మరొకటి లేదు. ఒక పుష్పము. పుష్పము మనకు యేమీ సహాయము చేయటం లేదు. మనకు అనుకూలములు చేయటం లేదు. చూచిన తక్షణమే ఆనందము వేస్తుంది. భగవంతుడు ప్రకృతి స్వరూపుడు. ఈ ప్రకృతిని చూచిన తక్షణమే ఆనందము వస్తుంది. ఈ ఆనందము నిమిత్తమే నేను అతనిని ప్రేమిస్తున్నానుగానీ ప్రతిఫలాపేక్షతో కాదు. కనుకనే వేదము నకర్మణా నప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వ మానశుః అనింది. ఈ త్యాగభావముచేత ఈ ప్రేమ స్వరూపుని చూచినప్పుడే మనకు అన్ని ఫలితములు చేకూరుతాయి. భగవంతుని ప్రేమించటమే నిజమైన ప్రేమ. ప్రేమ నిమిత్తమే ప్రేమ. సాధించవలసినది భగవంతుని ప్రేమ. అతని ప్రేమ ఒక్కటి ఉండెనా సర్వమూ సాధించిన వారమౌతాము. కనుక ఆ ప్రేమ నిమిత్తమై చింతించు. లౌకికమైన, క్షణభంగురమైన కష్టనష్టములకు నీవు చింతించ నక్కరలేదు. ఇది సరైన మార్గము కాదు. ఆ దైవత్వము పొందే నిమిత్తమై నీవు చింతించు. ఆ దైవత్వముయొక్క ఆనందము యిట్టిది అట్టిది అని ఎవ్వరూ కూడా వర్ణించలేరు. అవాఙ్మానస గోచరమైనది. యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ. మనస్సునకు గానీ, వాక్కునకుగానీ అందనిది యీ ఆనందము. ప్రాకృతమైన ఆనందము పరిమితముతో కూడి ఉంటుంది. ప్రాకృతమైన సంబంధము ఒక పరిమితముతో కూడి ఉంటుంది. ఇది పరిమితమునకు మీరినది. అతీతమైన తత్వము. అదియే దైవానందము. అదియే నిత్యానందము. అదియే యోగానందము. అదియే అద్వైతానందము.

ధర్మరాజు చదువుకొనే సమయములో యేవిధముగా చదువుకొన్నాడో తెలుసా? ద్రోణాచార్యుడు ధర్మరాజుకి విద్యలు చెప్పే సమయములో 'సత్యం, శాంతి' అని బోధిస్తూ వచ్చాడు. ఈ రెండింటియందు ఐదుమందీ సత్యంలో పాసైపోయారు. 'సత్యం' అనే క్లాసులో వాళ్ళు పాస్‌కావటంచేత వాళ్ళు ఉన్నత క్లాసుకు వెళ్ళిపోయారు. తరువాత క్లాసు 'శాంతం'. ఈ శాంతంలో కూడను భీముడు, అర్జునుడు, నకులుడు, సహదేవుడు ఫస్టుక్లాసులో పాసయ్యారు. కాని, ధర్మజుడు ఫెయిలవుతూ వచ్చాడు. ఎన్నోవిధాలుగా ద్రోణుడు చెబుతూ వచ్చాడు. 'అయ్యా! నీవు జ్యేష్ఠపుత్రుడవు. రేపటి దినము చక్రవర్తి కావలసినవాడవు. నీవే విద్యలో ఈవిధముగా వెనకపడితే రేపటి దినము నీ తండ్రికి యేవిధముగా ముఖము చూపించాలి?' అని అనేకవిధములుగా రాత్రి, పగలు, అర్ధరాత్రి సమయములో అతనికి బోధిస్తూ వచ్చాడు. ఈ ద్రోణాచార్యునకు కోపం వచ్చింది. తన చేతిలోనున్న కఱ్ఱతో బాగా కొట్టాడు. ఈ కొట్టిన స్థలములో రక్తము ప్రవహించుకుంటూ వచ్చింది. కన్నులు మూసుకున్నాడు దానిని భరించుకుంటూ వచ్చాడు. మరల ఆ పుండుపైనే మరొక దెబ్బ వేసేటప్పటికి, 'నేనింకా నేర్చుకోలేద'న్నాడు ధర్మజుడు. నేర్చుకోటమంటే ఏమిటి? శాంతమంటే కేవలము పాఠాలతో వచ్చేదీ, పదములతో బోధించేదీ కాదు. ఆ పుండుపైనే కొట్టాడు. శాంతంగా వున్నాడు. మరల కొంతసేపు తరువాత అదే పుండుపైన కొట్టేటప్పటికి ఆ శాంతం పోయింది. కాబట్టి, 'నేనింకా నేర్చుకోలేద'న్నాడు. తనయొక్క నిత్యజీవితములో, స్వానుభవములో నిరూపించే విద్య ధర్మజుని విద్య. జీవితములో ఎన్ని కష్టములు, ఎన్ని దుఃఖములు, ఎన్ని విచారములు, వాటిని భరించుకొని, సహించుకొని సాధించటానికి తగిన కృషిచేయటమే సరైన శాంతము.

ఎలాంటి పరిస్థితియందు సహనము. ధర్మజునకు అనేకవిధములైన కష్టములు వెంటాడినాయి. నిండుసభలో భార్యను పరాభవము గావించారు. ఆకులలములు మేసి అడవులలో సంచరించారు. ఏకచ్ఛత్రాధిపత్యాన్ని ఏలవలసిన ధర్మజుడు అరణ్యములలో కాలాన్ని కఠినమైన రీతిలో గడుపుతూ వచ్చాడు. అట్టి సమయమునకూడను శాంతమును కాపాడుకుంటూ వచ్చాడు. ఈ శాంతమే ప్రధానమైన ధర్మస్వరూపాన్ని ధరించింది. ఈ సహనమే సరైన ధర్మము. క్షణక్షణమూకూడా మనము ఒకవిధమైన 'చిట్ ఫట్' అని ఎగురుతూ వుండటానికి ప్రయత్నించకూడదు. దీనిని సరైన రీతిలో అదుపులో పెట్టుకోవాలి. ఒకానొక సమయములో ధర్మజుడు తన సోదరులతో కలసి అడవిలో సంచరిస్తూవచ్చాడు. ధర్మజుడు ముందుఅడుగు వేయలేకపోయాడు. అక్కడే ఒక వృక్షము క్రింద కూర్చున్నాడు. మొదట సహదేవుని పంపించాడు. 'నాయనా! ఈ పరిసర ప్రాంతములో కించిత్ జలము లభిస్తుందేమో తీసుకొని రమ్మన్నా'డు. పోయిన సహదేవుడు తిరిగి రాలేదు. తిరిగి నకులుని పంపించాడు. నకులుడుకూడను తిరిగి రాలేదు.

భీముని పంపించాడు. భీముడుకూడను తిరిగి రాలేదు. అర్జునుని పంపించాడు. అర్జునుడుకూడా తిరిగి రాలేదు. ఏమైపోయినారో అనిచెప్పి దాహం మర్చిపోయాడు. ఈ దాహం బాధ పూర్తిగా పోయింది పాపం. సోదరులు ఏమైనారో అనే బాధ అధికమైపోయింది. ఈ సోదరులపై వుండిన మమత్వముచేతను, అభిమానముచేతను ఎక్కడలేని బలము వచ్చింది శరీరానికి. వెతుకుతూ, వెతుకుతూ వెళ్ళాడు పాపం. ఒక కొలను ప్రక్క ఈ నలుగురూ మృతదేహులై పడివున్నారు. భరించలేని బాధను అనుభవించాడు ధర్మజుడు. ఈవిధముగా దుఃఖమును అనుభవిస్తున్న ధర్మజుని చూచి అశీరవాణి కొన్ని ప్రశ్నలు వేస్తూ వచ్చింది. అవే యక్షప్రశ్నలు. 'ధర్మజా! ఎవరి నిమిత్తమై నీవు దుఃఖిస్తున్నావు?' అని ప్రశ్నించాడు యక్షుడు. 'నా ప్రియ సోదరులను ఎవరు మృతిచెందించారు? వీరికీ గతి పట్టటానికి కారణమెవరు?' అని ప్రశ్నించాడు ధర్మజుడు. యక్షుడు చెప్పాడు, 'నేనే దానికి కారకుడను'. 'ఎందుకోసం నీవీ విధముగా వారిని చేశావు?' అని ధర్మజుడు ప్రశ్నించాడు. 'నాయొక్క పద్ధతి ఇది. నా కొలనులో నీరు త్రాగటానికి వచ్చిన ప్రతి వ్యక్తినీ కొన్ని ప్రశ్నలు వేయటం. ఈ ప్రశ్నలకు జవాబు సరిగా చెప్పిన వారికి తగిన అనుగ్రహాన్ని అందిస్తుంటాను. నీవుకూడను నా ప్రశ్నలకు సరైన జవాబు అందించి తదుపరి విచారించటానికి ప్రయత్నించమన్నా'డు యక్షుడు. ఈ యక్షుడు వేసిన ప్రశ్నలన్నింటికీ చక్కగా జవాబు చెప్పాడు ధర్మజుడు. కారణం హృదయము ధర్మమయము. ఈ ధర్మములోపల పవిత్రమైన భావములంతా స్పష్టంగా వస్తుంటాయి. ఇవి నేర్చిన విద్యలు కావు. ఇవి కూర్చిన విద్యలు కావు. హృదయమునుండి ఆవిర్భవించిన విద్యలు. అప్పుడు ధర్మజుడిచ్చిన జవాబులకు యక్షుడు మెచ్చి, 'అయ్యా! ధర్మరాజా! మున్ముందు మహాభారతయుద్ధం జరగబోతుంది. ఇందులో నీకు ఎవరు ప్రధానమో నీవు కోరుకో. వానిని నేను బ్రతికిస్తాను' అన్నాడు. ధర్మజునియొక్క విశాలమైన హృదయము, ఇదియే విద్యలయొక్క నిజమైన సారము. యోచించాడు. 'యక్షా! సహదేవుని అందించమ'న్నాడు. అప్పుడు యక్షుడు ఆశ్చర్యపడ్డాడు. రాబోయేది మహాభారతయుద్ధము. పరాక్రమవంతులైన భీముని, అర్జునుని కోరుకోకుండా చిన్నవాడైన సహదేవుని ఎందుకు కోరుకున్నావు?' అని యక్షుడు ప్రశ్నించాడు. 'యక్షా! నాకు యుద్ధము ప్రధానము కాదు. ధర్మము నాకు ఆధారము. జయాపజయములు మానవునియక్క స్వభావములు. కష్టములే లేకపోతే మానవత్వమే కనిపించదు. అన్నింటియందు ధర్మసూత్రమే నాకు ప్రధానమైన బ్రహ్మసూత్రము. నా తల్లికి పుట్టిన వారము మేము ముగ్గురం కుంతీదేవికి. ధర్మజ, భీమ, అర్జున. నా రెండవ తల్లియైన మాద్రికి పుట్టినవారు నకుల, సహదేవులు. ఆమె మమ్ములను యెన్నోవిధములుగా ప్రేమించేది. ఆమె బిడ్డలను నా తల్లికిచ్చి, 'అమ్మా! నీ స్వాధీనము చేస్తున్నాను' అని చెప్పి వదులుకుంది. కుంతికి పుట్టిన వారిలో నేను వుంటున్నాను. మాద్రికి పుట్టిన వారిలో ఒక్కడుండాలి. అదే నాయొక్క ఆశ.' ఈ విశాలమైన ధర్మసూత్రాన్ని గుర్తించిన యక్షుడు, 'ధర్మజా! నీ హృదయము పవిత్రమైనది. నలుగురికీకూడా నేను ప్రాణమిస్తున్నాను. తీసుకుపొమ్మన్నా'డు. చూడండి, ధర్మంలోపల ఒక్కదానికి మనం ప్రయత్నంచేస్తే అనేకము మనకు ప్రాప్తిస్తుంటాయి.

మహాభారతయుద్ధములో మహావీరుడైన ద్రోణాచార్యుని జయించుట పాండవులకు అసాధ్యమయింది. అప్పుడు శ్రీకృష్ణుడు ధర్మజునిచే ఒక చిన్న అబద్ధమును పలికించమని పాండవులకు సలహా యిచ్చాడు. అశ్వద్ధామ అనే పేరుగల ఏనుగు యుద్ధరంగంలో చనిపోయింది. అయితే ద్రోణాచార్యునికి 'అశ్వత్థామ హతః' అని స్పష్టంగా వినిపించేటట్లు 'కుంజరః' అన్న పదము వినీవినబడనట్లుగా ధర్మజునిచే పలికించారు పాండవులు. ద్రోణాచార్యునికి యుద్ధరంగంలో రణగొణధ్వనిలో 'కుంజరః' అన్న పదము వినిపించలేదు. 'అశ్వత్థామ హతః' అనే మాట విని, తన కుమారుడే చనిపోయినాడని అనుకొని ద్రోణాచార్యులు నిశ్చేష్టుడై నిలచియున్న సమయమున అతనిని పరిమార్చటం జరిగింది. ఈ ఘట్టము ధర్మజుని ఎంతో బాధించింది.అతడు, 'అయ్యో! అసత్యము లాడితినే! తెలిసి చేసినా, తెలియక చేసినా పాపము పాపమే. ఫలితమును అనుభవించవలసినదే' అని అనుకున్నాడు.

శ్రీకృష్ణ నిర్యాణానంతరము పంచపాండవులు ద్రౌపదితో మహాప్రస్థానం సాగిస్తూ ఉండగా ఒక్కొక్కరూ

ఒక్కొక్కరుగా క్రిందపడి అందరూ మరణించారు. అతని వెంట ఒక శునకము మాత్రము ఉంది. ఇంద్రాది దేవతలు ధర్మజునితో, 'ధర్మజా! శునకమును స్వర్గమున ప్రవేశపెట్టుటకు వీలులేదు. దానిని వదిలి నీవు మాత్రము స్వర్గమున ప్రవేశించు' అన్నారు. ధర్మజుడు, 'మహానుభావులారా! ఈ శునకము నావెంట జంటగా యింత దూరము వచ్చింది. నావారు అనేవారు ఎవ్వరూ రాలేకపోయారు. శునకమును ప్రవేశపెట్టకపోయినచో నేనుకూడా స్వర్గమున ప్రవేశించను' అని దృఢముగా పలికాడు. మరునిముషములో అక్కడ శునకము లేదు. ధర్మజుని తండ్రి అయిన యమధర్మరాజు నిలుచుని ఉన్నాడు. 'కుమారా! నిన్ను పరీక్షించుటకు ఈవిధముగా చేసాను. నాతోరా! నీవు అలనాడు యుద్ధరంగమున పలికిన అసత్యమునకు కొన్ని ఘడియలు నరకమున వుండాలి' అని యమధర్మరాజు పలికాడు. అదేవిధముగా ధర్మజుడు నరకమున ప్రవేశించాడు.

ధర్మజుడు సలసల కాలిపోవుచున్న నరకమున పాదము మోపినంతనే అంతటా ఒక చల్లదనము ఆవరించింది. నరకవాసులు, 'ఇదేమివింత! ఎంత హాయిగా ఉన్నది ఈ నరకము' అనుకొని కారణము అడిగి తెలుసుకున్నారు. ధర్మజుడు కొన్ని నిముషములు గడచిన తరువాత నరకమును వీడి స్వర్గమునకు వెళ్ళవలసి వచ్చింది. నరకవాసులందరూ అతని చుట్టూ చేరి, 'మహాత్మా! నీవిచ్చటనే వుండరాదా?' అని ప్రార్థించారు. ధర్మజుడు వెంటనే యమధర్మరాజు అనుగ్రహముతో తాను సంపాదించిన పుణ్యఫలమంతయు ఆ నరకవాసులకు ధారపోశాడు. ఆ కారణంగా నరకవాసులందరూ పాపవిముక్తులయ్యారు.